## ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ వినతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ విభాగం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ వైద్యం లేకపోవడంతో అత్యవసర చికిత్సకు ప్రజలు హైదరాబాద్, వరంగల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని ఉమ్మడి జిల్లాకు ప్రధాన కేంద్రమైన కరీంనగర్‌లో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ వైద్య సౌకర్యం అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో క్రిటికల్ కేర్ వైద్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని యుగంధర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకనుగుణంగా సివిల్ సప్లయి కార్మికుల వేతనాలు

ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి :** సివిల్ సప్లయి కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు కార్మికులు ఆందోళన కార్యక్రమం చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 6రోజులుగా సివిల్ సప్లయి హమాలీ కార్మికులు సిరిసిల్ల, వేములవాడ ఎంఎల్ఎస్ పాయింట్‌లో సమ్మె చేస్తున్నారని, గతంలో 2సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగాలని జిఒ ఉన్నప్పటికి దీనికి అనుగుణంగా జనవరి 1, 2024 నుండి వేతనాలు పెరగలేదన్నారు. అక్టోబర్ 4వ తేది 2024న సమ్మె చేపట్టిన సందర్భంలో చర్చలకు పిలిచి క్వింటాళ్‌కు 26 రూ.లు ఉన్న ధరను 29 రూ.లు పెంచారని, ఇప్పటి వరకు పెంచిన ధర ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పుప్పాల రాజేష్, మల్లయ్య, శివలింగం, రాజిరెడ్డి, జాంపెల్లి వెంకటేషం, రాగుల భద్రయ్య, పుప్పాల దుర్గయ్య, దేవయ్య, కోమటి కిరణ్, వెంకట్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యారన్ డిపోతోనే ప్రభుత్వం ఆర్డర్లను ఉత్పత్తి

పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి రవి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వం యారన్ డిపో ద్వారానే ప్రభుత్వ ఆర్డర్లను ఉత్పత్తి చేయాలని చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించి కార్మికుల ఆసాముల ఎన్నో దశాబ్దాల కల యారన్ డిపో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి చొరవతో నెరవేరిందన్నారు. రెండు మాసాల క్రితం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా యారన్ డిపోను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. గతంలో మాదిరిగా కొద్దిమంది యజమానులే కాకుండా చిన్న తరగతి వ్యాపారస్తులకు ఆసాముల కు యారన్ డిపో ద్వారా నూలు అందించి ప్రభుత్వానికి అవసరమైన వస్త్రలను ఉత్పత్తి చేయించుకోవాలని నిర్ణయించామన్నారు. సిరిసిల్లలోయాజమానులకు లూమ్స్ లేకున్నా ఆసాములను కార్మికులను శ్రమ దోపిడికి చేస్తూ బడా యజమానులుగా చలామణిగా అవుతున్నారన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు 'జిఒ22'ను అమలు చేసి జీతాలు పెంచాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జిఒ నెంబర్ 22ను అమలు చేసి జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందని ఆర్జీ వన్ అధ్యక్షుడు ఎం.ఎ.గౌస్ తెలిపారు. ధర్నా అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు ముప్పై వేల మంది కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని జీతంతో జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనాల పెంపుదల కోసం రాష్ట్ర ప్రభుత్వ జిఒ 22 ను అమలు చేయాలని, లేదా హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని 2022 సంవత్సరంలో యాజమాన్యం కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకున్నారని, ఇప్పటివరకు యాజమాన్యం దానిని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపుదలతో పాటు హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్స్ కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని దిమాండ్ చేశారు. తక్షణమే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిచో సింగరేణి వ్యాప్తంగా పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు, కాంట్రాక్టు కార్మికులు అబ్దుల్ ఘని, రామాంజనేయులు, శ్రీనివాస్, నర్సయ్య, విజయ, మహేశ్వరి, వనిత పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా..
# హామీలు అమలు చేస్తున్నాం

బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెల్లడించారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని ఐబిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, బిఅర్ఎస్ పార్టీలు ఒకే ఎజెండాలో పనిచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీల నాయకులు తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని కోరారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతులకు, ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలతో ఇప్పటికీ నిరసనలు, నిరాహారదీక్షలు జరుగుతున్నా . రైతులు తమ ప్రాణలను పణంగా పెట్టి ఎందుకు పోరాడుతున్నారో కేంద్రమంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.40వేల కోట్లు అప్పుచేసి ఖాళీ గుదిబండ అప్పగించారన్నారు. వారే నేడు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటికి రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్, రైతులకు ఎలాంటి షరతులు లేకుండా సాగు భూముల రైతు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.12వేలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బొల్లిశెట్టి శివయ్య, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మా రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఓటర్లు 7.20 లక్షలు

కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జగిత్యాల జిల్లా ఓటర్ల జాబితా తుది ప్రచురణను సోమవారం అధికారులు విడుదల చేశారు. జగిత్యాల జిల్లాలో ఈనెల ఆరవ తేదీ నాటికి 7,20,566 మంది ఓటర్లు నమోదు అయ్యారు. అలాగే సర్వీస్ ఓటర్లు 237 నమోదయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రిజిస్టర్ నేషనల్, స్టేట్ పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు ప్రచురణ చేసిన కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా అందజేశారు. ఆయా పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను కలెక్టర్ సేకరించారు. అనంతరం ఇవిఎం గోదాంను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశానుసారం ఇవిఎంల భద్రత ప్రతి నెల చేసే తనిఖీలో భాగంగా సోమవారం సందర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, జగిత్యాల ఆర్‌డిఒ మధుసూదన్, సంబంధిత అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 26 దరఖాస్తులు ఇతర శాఖలకు సంబంధించి 16 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సంబంధిత అధికారులకు కేటాయిస్తూ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### డ్రోన్ సేవలు మరింత విస్తృతంగా అమలుకు చర్యలు

జిల్లాలో వ్యవసాయరంగంలో డ్రోన్ సేవలు మరింత విస్తృతంగా అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలంలోని బంధంపల్లిలోని విఘ్నేశ్వర డ్రోన్స్ సేల్స్, సర్వీసెస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు మరింత లాభం లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీలను వినియోగిస్తూ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి వ్యవసాయ యాంత్రీకరణకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి అనంతరం వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు, ధరణి, భూ సేకరణకు సంబంధించిన దరఖాస్తులపై కలెక్టర్ పమేలా సత్పతి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హాస్టళ్లను తనిఖీ చేసి సౌకర్యాలు పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులు, ఎంఇఒలకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి ధరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో మిగిలి ఉంటే పూర్తి చేయాలన్నారు. యాప్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసినట్లు తేలితే సర్వే చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్‌ఒ పవన్ కుమార్, ఆర్‌డిఒలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

### ప్రజావాణికి మొత్తం 254 దరఖాస్తులు

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను అధిక ప్రాధాన్యమిస్తూ పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మి కిరణ్, ఇంచార్జి డిఆర్‌ఒ పవన్‌కుమార్, డిఆర్‌డిఒలు మహేశ్వర్, రమేష్‌బాబుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 254 ధరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

### కరీంనగర్ జిల్లాలో 10,82,751 మంది ఓటర్లు

కరీంనగర్ జిల్లాలో 10 లక్షల 82 వేల 751 మంది ఓటర్ల వివరాలతో తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ జిల్లా పరిధిలోగల కరీంనగర్, చొప్పదండి (ఎస్సీ, మానకొండూర్ (ఎస్సీ), హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రజల వివరాలతో తుది ఓటరు జాబితా విడుదల చేశామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 5,30,337 మంది పురుషులు, 5,52,353 మంది స్త్రీలు, 61 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారన్నారు. మరో 584 పురుషులు, 30 మహిళలు సర్వీసు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు.

### ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ - కలెక్టర్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాల కండిషన్ పరిశీలించాలని, అన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఈ నెల 31 వరకు నిర్వహించనున్న రోడ్డు భద్రత మాస ఉత్సవాలపై రవాణా, ఆర్‌అండ్‌బి, వైద్యశాఖ, ఆర్టీసి, ఎక్సైజ్, విద్యాశాఖ తదితర అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ సమావేశం నిర్వహించారు. పోలీసు కమిషనర్, ఎసిపిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ సమన్వయంతో అవసరమైన చోట మరమ్మత్తులు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్‌పేయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, రోడ్ల భవనాల శాఖ ఇఇ జి.సాంబశివరావు, డిఇ మనోహర్, ఆర్‌టిసి డిప్యూటీ ఆర్‌ఎం భూపతిరెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం, డిఇఒ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళల్లో భర్తీ చేయని ఉద్యోగాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల్లోనే 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేసేందుకు కాల పరిమితి ఐదు సంవత్సరాలున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకకం అమలు చేస్తేన్నామన్నారు. రైతులకు లక్ష రూపాయలు రుణ మాఫీ చేసిందన్నారు. రైతులకు ఎంత భూమి ఉన్న పిఎం కిసాన్ యోజన కింద ఇచ్చేది కేవలం రూ.ఆరు వేలు మాత్రమేనని అది కూడా మూడు దశల్లో ఇస్తున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వం మొదటి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా ఐదేళ్ల రుణమాఫీ చేసిందని విమర్శించారు. రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేక చేతులు ఎత్తేసిందన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల రెండు లక్షల రుణ మాఫీకి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని జీవన్ రెడ్డి చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి పంటకు 6వేల చొప్పున రెండు పంటలకు రూ.12వేలు అందిస్తామని తెలిపారు. రైతు కూలీలకు చేయూత అందించేందుకు నెలకు వెయ్యి చొప్పున ఏడాదికి 12వేలు అందిస్తున్నామని జీవన్‌రెడ్డి చెప్పారు. పదేళ్ల కాలంలో రైతు కూలీలను ఆదుకోవాలని ఏనాడైనా బిజెపి గానీ, బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ ఆలోచన చేశాయా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని రైతు భరోసా అమలు చేస్తున్నారని బిజెపి విమర్శించడంపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు చేయకపోతే చేయలేదు అంటారు..అమలు చేస్తే విమర్శిస్తారు..అసలు సంక్షేమ పతాకాలు అమలు చేయాలని కోరుకుంటున్నారా.. చేయవద్దనుకుంటున్నారా అని నిలదీశారు. సన్న రకాలకు మద్దతు ధరకు అదనంగా బోనస్ రు.500 ఇస్తున్నది కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని పునరుద్ఘాటించారు. ఎనిమిదేళ్లుగా మెస్‌చార్జీలు పెంచలేదు.. నిరుపేదలకు నాణ్యమైన భోజనం పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచిందన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శలు చేయడమే కాదు.. మంచిని కూడా గ్రహించాలి జీవన్ రెడ్డి హితవు పలికారు. సమావేశంలో విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, బండ శంకర్, పుప్పాల అశోక్, దుర్గయ్య, బీరం రాజేష్, గుంటి జగదీశ్వర్, చందా రాధకిషన్, కమటాల శ్రీనివాస్, స్వామి రెడ్డి, పరీక్షిత్ రెడ్డి, లైశెట్టి విజయ్, బొల్లి శేఖర్, ధర రమేష్ బాబు, భారీ,గంగం మహేష్,రజినీకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి హబ్‌గా జగిత్యాల

ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ వెల్లడి

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** విద్య, వైద్యానికి హబ్‌గా జగిత్యాలను తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్ సోమవారం సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలాస వ్యవసాయ కళాశాలలో భవనం పూర్తి చేయటం జరిగిందని, జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ వచ్చిందని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధి చేస్తానన్నారు. చల్‌గల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు అయిందని, ఉప్పు మడుగు కస్తూర్బా పాఠశాల భవనం నిర్మాణం త్వరలోనే పనులు ప్రారంభం చేస్తామని, బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామంలో కస్తూర్బా పాఠశాల మంజూరు అయిందని, నర్సింగ్ కళాశాల, మెడికల్ కాలేజి ఏర్పాటు చేసుకున్నామని, కేంద్రీయ విద్యాలయం, ఏకలవ్య పాఠశాల మంజూరు కానున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ శ్రీనివాస్, ఎంపిడిఒ రమాదేవి, డిఇ మిలింద్, ప్రిన్సిపాల్ సరిత దేవి, ఎంపిఒ రవి బాబు, ఎంఇఒ గాయత్రి, ఎఇ రాజమల్లయ్య, నాయకులు బాలముకుందం, రజిత శేఖర్, బోడ్డు దామోదర్, దుమాల తిరుపతి, నాగిరెడ్డి గంగారెడ్డి, ఆరే రవి, నక్క హరీష్, సత్తయ్య, కార్యదర్శి మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రీవెన్స్‌డే బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** గ్రీవెన్స్‌డే బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జగిత్యాల జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11మంది అర్జీదారులతో నేరుగా ఎస్‌పి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఫిర్యాదుదారుడికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ పర్యవేక్షణ చేయాలని ఎస్‌పి తెలిపారు.

# ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'ప్రజాపక్షం'

చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి :** ప్రజా సమస్యలపై నిత్యం అక్షర సమరం సాగిస్తూ 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రజల పక్షాన నిలుస్తున్నదని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. నిజాలను నిర్భయంగా ప్రజా గొంతుకై కలం పోరు చేస్తున్నదని కొనియాడారు. 'ప్రజాపక్షం' దినపత్రిక రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేడిపలి సత్యం చొప్పదండి పట్టణంలో సోమవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజాభిమానం పొందిన పత్రిక ప్రజాపక్షం అన్నారు. చొప్పదండి ప్రజాపక్షం విలేకరి బొడిగె సాయిని ఈ సంధర్భంగా అభినందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి గుర్రం భూంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరమాండ్ల గంగయ్య గౌడ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మాజీ సర్పంచ్ మునిగాల సుధాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, గుర్రం రమేష్, కడారి శంకర్, నల్లాల అఖిల్, కనుమల్ల రాజశేఖర్, తోడేటి విద్యాసాగర్, తాండ్ర వేణుగోపాల్, నూనె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




### అనునిత్యం ప్రజల గొంతుక : గొల్లపల్లి ఎస్ఐ సతీష్

**గొల్లపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సమాచారం అందిస్తూ అనునిత్యం ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం' దినపత్రిక పనిచేస్తుందని గొల్లపల్లి ఎస్ఐ చిర్ర సతీష్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం దినపత్రిక 2025 క్యాలెండర్‌ను ఎస్ఐ సతీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మీడియా పాత్ర కీలకంగా ఉంటుందని, ప్రజా సమస్యలను సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా పాత్రికేయులు పనిచేయాలన్నారు. పత్రికలు ప్రజలు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని వాస్తవాలను మాత్రమే ప్రచురించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రజలతోపాటు పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఖాజామియా, జర్నలిస్టులు అంకం భూమయ్య, జంగిలి సత్యం, సజ్జనపు జనార్ధన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

